
## 21న ఆశ కార్యకర్తల పాదయాత్ర


జిల్లా వైద్యాధికారికి వినతి పత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 18 : ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని ఈ నెల 21న ఉదయం 9 గంటలకు సిరిసిల్ల కాలేజీ గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ తెలిపారు. ఈ మేరకు 21న ఆశ కార్యకర్తలు విధులు హాజరు కాబోరని శనివారం జిల్లా వైద్యాధికారి రజితకు ఆశ కార్యకర్తల సంఘం తరపున వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పాదయాత్రలో జిల్లాలోని అన్ని పాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశ కార్యకర్తలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాదయాత్ర కార్యక్రమం తర్వాత కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తామని తెలిపారు. ఆశ కార్యకర్తలకు ₹18 వేల వేతనం ఇవ్వాలని తమ ప్రధాని డిమాండ్‌గా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదవేణి మంజుల, భూలక్ష్మి పాల్గొన్నారు.



# డ్యామిట్

## కథ అడ్డం తిరుగుతోంది?


- పరస్పర బదిలీల్లో పంతుళ్లకు కొత్త చిక్కులు
- మొదట సై.. ఇప్పుడు నై అంటున్న టీచర్లు
- ఉమ్మడి జిల్లా నుంచి 104 మంది దరఖాస్తులు
- ₹5 కోట్లకుపైగా చేతులు మారిన డబ్బులు?
- అండర్ టేకింగ్ ఇవ్వడానికి వెనుకడుగు
- 31 వరకు రిటైర్డ్ అయ్యే వారే అధికం
- ఆ లోగా బదిలీ కాకుంటే పరిస్థితి ఏమిటన్న ఆందోళన
- షరతుకు ఓకే చెబితేనే 'అండర్‌టేకింగ్' ఇస్తామంటూ కండీషన్

పరస్పర బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు ఉపాధ్యాయులకు కొత్త చిక్కులొచ్చి పడుతున్నాయి. ముందుగా అంగీకరించిన వారిలో కొంత మంది ఇప్పుడు వెనుకడుగు వేస్తుండడం.. మరికొంత మంది కొత్త కండీషన్లను తెరపైకి తెస్తుండడంతో కథ అడ్డం తిరుగుతున్నది. అంతా అయిపోయిందనుకునే సమయంలో రోజుకో ట్విస్ట్‌తో సదరు టీచర్లలో ఉత్కంఠ నెలకొంది. ఎలాగూ ఈ నెల 31లోగా రిటైర్డ్ అవుతున్నామని భావించిన కొంత మంది పంతుళ్లు.. ముందుగా డబ్బులు తీసుకొని పరస్పర బదిలీల్లో ఎంత దూరమైనా వెళ్లేందుకు ఓకే చెప్పినా.. ప్రస్తుతం వయోపరిమితి పెంపుపై వస్తున్న వార్తల నేపథ్యంలో వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తున్నది. మరికొంత మంది ఈనెల 31లోగా పరస్పర బదిలీలు కాకపోయినా తాము తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేది లేదని, అందుకు అంగీకరిస్తేనే అండర్‌టేకింగ్ పత్రం డీఈవో కార్యాలయంలో ఇస్తామంటూ కొత్త కండిషన్ పెడుతున్నట్టు తెలుస్తున్నది. మొత్తంగా పరస్పర బదిలీల్లో కథ అడ్డం తిరిగిందనడానికి ఇవే నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, ప్రస్తుతం ఈ చర్చ ఉపాధ్యాయ వర్గాల్లో జోరుగా సాగుతున్నది.

కరీంనగర్, జనవరి 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం పరస్పర బదిలీలకు అవకాశమిచ్చింది. అందులో భాగంగా డిసెంబర్ ఒకటి నుంచి 31 వరకు దరఖాస్తులు సమర్పించుకునే వీలు కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా 925 మంది ఉపాధ్యాయులు పరస్పర బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా, అందులో కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి 104 మంది దరఖాస్తు చేశారు. వీరిలో జగిత్యాల జిల్లా నుంచి 17 మంది, కరీంనగర్ 62, పెద్దపల్లి 16, రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి 9 మంది ఉన్నారు. అయితే తాము కోరుకున్న చోటికి రావడానికి కొంత మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎంత మొత్తం వెచ్చించడానికైనా వెనుకాడడం లేదని తెలుస్తున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఒక్కో ఉపాధ్యాయుడు ₹5 లక్షల నుంచి ₹10 లక్షల వరకు ఒప్పందాలు చేసుకున్నట్టు తెలుస్తున్నది. కొంతమంది అయితే ఏకంగా ₹12 లక్షల వరకు కూడా వెచ్చించడానికి ముందుకొచ్చినట్టు విశ్వసనీయ సమాచారం అందుతున్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ పరస్పర బదిలీల్లో దాదాపు ₹5కోట్లపై చిలుకు ఇప్పటికే చేతులు మారినట్టు, అందుకు సంబంధించి ఒప్పందాలు పక్కాగా జరిగినట్టు తెలుస్తున్నది. కాగా, పరస్పర బదిలీల విషయంలో దరఖాస్తుదారుడు–1, దరఖాస్తుదారుడు–2 (అప్లికెంట్1, అప్లికెంట్–2) నుంచి అండర్‌టేకింగ్ పత్రాలను తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. ఈ పత్రాలను ఈనెల 17 నుంచి 22 వరకు సదరు ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయంలో సమర్పించాలని చెప్పింది. ఈ పత్రాలను సేకరించి, ఆ జాబితాను పంపించాలని జిల్లా అధికారులను ఆదేశించింది.

### కొత్త చిక్కులు

పరస్పర బదిలీలు అవుతాయని అందరూ భావిస్తున్న సమయంలో ప్రస్తుతం కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే కథ అడ్డం తిరుగుతున్నది. నిజానికి వివిధ ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులు.. పట్టణప్రాంతాలకు వచ్చేందుకు ఎంత డబ్బులైనా ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలో ఈనెల 31న రిటైర్డ్ అయ్యే టీచర్ల వివరాలను తెలుసుకొని, వారితో ఒప్పందం చేసుకొని డబ్బులు అప్పగించినట్టు తెలుస్తున్నది. 'ఎలాగూ ఈనెల 31తో రిటైర్ అవుతున్నాం. ఉద్యోగ విరమణ ఎక్కడైతే ఏంటి?' అన్న కోణంలో ఆలోచించిన సదరు పంతుళ్లు, పరస్పర బదిలీల్లో ఎంత దూరమైనా వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఆ మేరకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తయింది. ఇంతవరకు బాగానే ఉన్నా తాజాగా కథ అడ్డం తిరుగుతున్నది. ప్రధానంగా ఇటీవల ఉద్యోగుల వయో పరిమితి పెంచేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నదన్న వార్తలు వస్తున్నాయి. అందుకోసం ప్రభుత్వం ఓ ఫైల్ కదుపుతున్నదని, అందుకు కావాల్సిన వివరాలు సేకరిస్తున్నదన్న వార్తలు ఇటీవల బయటకు వచ్చిన విషయం తెలిసిందే. నిజంగానే వయో పరిమితి పెంచితే.. పరస్పర బదిలీల్లో తాము దూరం వెళ్లిన చోటే ఉద్యోగం చేయాల్సి వస్తుందన్న భయంతో ముందుగా అంగీకారం తెలిపిన చాలా మంది పంతుళ్లు వెనకడుగు వేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇదే సమయంలో పరస్పర బదిలీల ఫైలుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలుపాల్సి ఉండగా, సీఎం విదేశీ పర్యటనల నేప



థ్యంలో ఆలస్యమయ్యే అవకాశాలున్నాయన్న చర్చ ప్రస్తుతం నడుస్తున్నది. ఒకవేళ ఈ నెల 31లోగా ఈ ఫైలుకు ఆమోద ముద్ర లభించకపోతే ఏమిటన్న ప్రశ్నలు పలువురు టీచర్లలో ఉత్పన్నమవుతున్నాయి. దీంతో ఒప్పందం చేసుకున్న ఉపాధ్యాయులు.. ఇప్పుడు కొత్త వాదన తెరపైకి తెచ్చినట్టు తెలుస్తున్నది. చేసుకున్న ఒప్పందం ప్రకారం అండర్ టేకింగ్ ఇవ్వాలంటే.. ఈ నెల 31లోగా బదిలీలకు ఆమోద ముద్రపడినా.. పడకపోయినా సరే తమకిచ్చిన డబ్బులు తిరిగి ఇచ్చేది లేదని, ఆ షరతుకు ఓకే అయితేనే అండర్‌టేకింగ్ ఇస్తామని చెబుతున్నట్టు తెలుస్తున్నది. దీంతో ఔత్సాహిక ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. ఒకవేళ 31లోగా పరస్పర బదిలీలు జరక్కపోతే రెంటికి చెడ్డ రేవడిలా తమ పరిస్థితి మారుతుందన్న ఆందోళన కనిపిస్తున్నది. ప్రస్తుతం ఈ విషయం విద్యాశాఖలో హాట్‌టాపిక్‌లా మారింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఎంత మంది అండర్‌టేకింగ్ పత్రాలు ఇస్తారో ఈ నెల 22 తర్వాత తెలుస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




మార్చి2023లో ఎండాకాలంలో సైతం మత్తడి దూకుతున్న ఊర పెద్ద చెరువు

నేడు వెలవెలబోతున్న మన్నెంపల్లి ఊర పెద్దచెరువు

## నాడు జలకళ.. నేడు వెలవెల


బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో ఎండకాలంలోనూ నిండా నీళ్లతో గలగలా సప్పుడు చేస్తూ మత్తడి దుంకిన ఆ చెరువు.. నేడు జనవరిలోనే వెలవెలబోతున్నది. మన్నెంపల్లి గ్రామంలోని పెద్ద ఊరచెరువు 2023 సంవత్సరం మార్చి నెలలోనూ తోటపల్లి రిజర్వాయర్ ద్వారా డీ4 కెనాల్ నుంచి వచ్చే నీటితో నిండి, మత్తడి దుంకి దాని కిందే ఉన్న బతుకమ్మ చెరువు నిండి, అక్కడి నుండి పోరండ్ల గ్రామ శివారులోని కుంటలోకి వెళ్లేవి. ఈ క్రమంలో ఆ చుట్టుపక్కల రైతులు ఎండాకాలంలో సైతం ఎంతో భరోసాతో వరిసాగు చేసుకునేవారు. కానీ, నేడు జనవరి సమయంలోనే కుంటలు, చెరువులు నిండి లేకపోవడంతో నాడు మత్తడి దుంకిన రోజులను గుర్తు చేసుకుంటూ, నేడు వెలవెలబోతున్న దృశ్యాన్ని చూస్తూ రైతులు కొంత భయాందోళనకు గురవుతున్నారు. - తిమ్మాపూర్, జనవరి 18


మానేరు డ్యాం కట్టపై పొగమంచులో వాకర్స్

## కమ్మేసిన పొగమంచు

చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. రెండు రోజులుగా వణికిస్తున్నది. ఇటు పొగమంచు కమ్మేస్తున్నది. శనివారం ఉదయం పది గంటల వరకూ పరుచుకున్నది. ఎక్కడ చూసినా తెరలు తెరలుగా దర్శనమిచ్చింది. పట్టణాల్లో రోడ్లపై వాహనాలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకొని వెళ్లాల్సి వచ్చింది. శివార్లలో పొగమంచు పరుచుకొని అందమైన దృశ్యాలు కనువిందు చేయగా, 'నమస్తే' క్లిక్‌మనిపించింది!

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్


మానేరు డ్యాం కింద పరుచుకున్న పొగమంచు

## వెంటిలేటర్‌పై చిన్నారి


వెంటిలేటర్‌పై అర్షద్ అలామ్

- 17 నెలల బాబుకు బ్రెయిన్ ఇన్ఫెక్షన్
- ప్రాణాపాయ స్థితిలో మంచాన
- చికిత్సకు ₹10 లక్షల వరకు ఖర్చు
- స్థోమత లేక ఇంటికి తరలించి చికిత్స
- టీకా వికటించడం వల్లేనని తల్లిదండ్రుల ఆరోపణ
- సాయం అందించాలని వేడుకోలు సెల్ నెంబర్ : 9121882729

కొడిమ్యాల, జనవరి 18 : బుడిబుడి నడకలతో ఆ ఇంట సందడి చేసిన బాలుడు, బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో మంచానికే పరిమితమయ్యాడు. వెంటిలేటర్‌పై ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఇప్పటి వరకు చికిత్స కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసిన ఆ తల్లిదండ్రులు, ఆర్థిక స్థోమత లేక ఇంటికి తీసుకువచ్చి చికిత్స అందిస్తున్నారు. దాతలు సాయం అందించి తమ కొడుకు ప్రాణం కాపాడాలని వేడుకుంటున్నారు. బాబు తల్లిదండ్రుల కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలంలోని తుర్కకాశీనగర్ గ్రామానికి చెందిన షేక్ అశ్రఫ్, అనిఫాకు 17 నెలల బాబు అర్షద్ అలామ్ ఉన్నాడు. ఈ నెల 4న గ్రామానికి వచ్చిన వైద్య సిబ్బంది.. ఆ బాబుకు టీకాను వేశారు. అదే రోజు సాయంత్రం బాబుకు తీవ్రమైన జ్వరం రావడంతోపాటు వాంతులు కావడంతో వెంటనే తల్లిదండ్రులు కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ మూడు రోజులపాటు వైద్యం అందించిన తగ్గకపోవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ బాబుకు బ్రెయిన్ ఇన్ఫెక్షన్ వచ్చిందని చెప్పిన వైద్యులు, 11 రోజులపాటు చికిత్స అందించారు. అప్పటికే తల్లిదండ్రులు ₹10 లక్షలు ఖర్చు చేశారు. తర్వాత చికిత్సకు డబ్బులు లేకపోవడంతో వైద్యులు వెంటిలేటర్ ఏర్పాటు చేసి బాబును ఈ నెల 16న ఇంటికి పంపించారు. పదిహేను రోజులకోసారి దవాఖానకు తీసుకురావాలని సూచించారు. అయితే, వెంటిలేటర్‌కు రోజుకు ₹2 వేల వరకు ఖర్చవుతున్నదని, ఇప్పటికే అప్పులు చేసి చాలా ఖర్చు చేశామని, ఇల్లు గడవడమే


సాయం కోరుతున్న తల్లిదండ్రులు అశ్రఫ్, అనిఫా

కష్టమవుతున్నదని బాబు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దాతలు ముందుకు వచ్చి తమ ఫోన్ నెంబర్ 9121882729 కు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా సాయం అందించి తమ కొడుకును కాపాడాలని కోరుతున్నారు. టీకా వికటించడం వల్లే బాబుకు బ్రెయిన్ ఇన్ఫెక్షన్ అయిందని, వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై మండల ప్రాథమిక వైద్యురాలు పరమేశ్వరిని వివరణ కోరగా.. బాబుకు ఇంతకు ముందే అకోస్టిక్ న్యూరోమా వేస్టు ప్లేస్ రాబోవా అనే అనారోగ్య సమస్య ఉందని, ఇంజక్షన్ వేయడం అలా కాలేదన్నారు. ఇంజక్షన్ వేసే సమయంలో బాబు ఆరోగ్యం బాగానే ఉందని జ్వరం లేదని వివరించారు.

## దాడి సిగ్గుచేటు

రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, జనవరి 18: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం సిగ్గుచేటని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..? కేసులా బనాయిస్తారా..? అని ప్రశ్నించారు. సాగు భూములకు నీరివ్వాలలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తే దాడులకు పాల్పడుతారా..? అని ధ్వజమెత్తారు. దాడిని ఖండిస్తున్నట్టు ఆయన తెలిపారు. కేసులకు, బెదిరింపులకు బీఆర్‌ఎస్ నాయకులు భయపడరని స్పష్టం చేశారు, రవిశంకర్ ఇంటిపై దాడిని ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు ఖండించాలని కోరారు. దాడికి ప్రోత్సహించిన రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

డిమాండ్ చేశారు. ఇక్కడ బీఆర్‌ఎస్ నాయకులు మారుతి, కుమ్మరి శ్రీనివాస్, అచ్చివేణు, నీరటి శ్రీనివాస్, రాకం దామోదర్, తిమోతి, జక్కుల తిరుపతి, నీరటి శ్రీనివాస్, సట్టు శ్రీనివాస్, ఇరుగురాళ్ల శ్రావణ్, కిరణ్, వెంకన్న, ఓదెలు, వెంకటేశ్, రామరాజు ఉన్నారు.

## రైతు భరోసా దక్కేది

# ఎందరికి?

- కష్టతరంగా సాగు భూముల సర్వే!
- నాలుగు రోజుల్లో పూర్తిపై అనుమానాలు
- పెద్ద మండలాల్లో సాధ్యం కాదన్న అభిప్రాయాలు
- కొన్ని రికార్డులతోనే క్షేత్ర స్థాయికి బృందాలు
- 'ఇందిరమ్మ ఆత్మీయత'పై 'భరోసా' కోల్పోతున్న కూలీలు
- ఆ ఒక్క నిబంధనతో వేలాది మందిపై అనర్హత వేటు!
- రైతుల్లో ఆందోళన


కరీంనగర్ రూరల్: బొమ్మకల్‌లో సర్వే చేస్తున్న సర్వేయర్, ఏఈవో పైడితల్లి

కరీంనగర్, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : కొత్తగా నాలుగు పథకాలు అమలు చేసే క్రమంలో ఈ నెల 12న ఉమ్మడి జిల్లా అధికారులతో ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ నిర్వహించిన సమీక్షా సమావేశం తూతూ మంత్రంగా ముగిసింది. కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో మంత్రుల ఉపన్యాసాలు మినహా అధికారులకు మార్గనిర్దేశం చేసింది లేదు. అయితే, ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఈ నెల 16 నుంచి సాగుకు యోగ్యమైన భూములను గుర్తించేందుకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి సర్వేలు చేస్తున్నారు. ప్రతి వ్యవసాయ క్లస్టర్‌కు ఒకటి చొప్పున కరీంనగర్ జిల్లాలో 76 బృందాలు ఏర్పాటు చేశారు. అందులో వ్యవసాయ విస్తరణ అధికారితోపాటు రెవెన్యూ శాఖ నుంచి గిర్దావర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, సర్వేయర్ సభ్యులుగా ఉన్నారు. సర్వే కోసం భూభారతి (ధరణి) పోర్టల్లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూములను గుర్తించాలి. సాగుకు యోగ్యత లేని భూములను తొలగించేందుకు నాలుగు ప్రామాణికాలను రూపొందించారు. ఇండ్లు, లేదా కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్ లే ఔట్లు, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలు, గోదాములు నిర్మించిన భూములు, మైనింగ్‌కు వినియోగిస్తున్న భూములు, ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూములు, రాళ్లు, రప్పలు, గుట్టలతో నిండి సాగుకు అనువుగా లేని భూములను గుర్తించి రైతుభరోసా పథకం నుంచి మినహాయించాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తున్నది. అందుకోసం మండల వ్యవసాయ అధికారులకు భూభారతి పోర్టల్లో లాగిన్ అయ్యే అవకాశం ఇచ్చింది. వీటిని డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత సర్వే బృందాలకు అందిస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా సర్వేలో భూములను నిర్ధారించడంలో బృందాలకు తిప్పలు తప్పడం లేదు.

### కష్టతరంగా భూముల నిర్ధారణ

వ్యవసాయ యోగ్యంకాని భూములను నిర్ధారించడంలో తహసీల్దార్‌లు, మండల వ్యవసాయ అధికారులను ప్రభుత్వం బాధ్యులుగా చేసింది. ఈ ప్రక్రియ ప్రతి రెవెన్యూ గ్రామం అంటే వ్యవసాయ క్లస్టర్ వారీగా జరుగుతున్నది. అయితే, సర్వే బృందం ఏ గ్రామానికి వెళ్లినా అక్కడి భూములకు సంబంధించిన రికార్డులు పూర్తిగా వెంట తీసుకెళ్లాలి. ముఖ్యంగా ఆర్‌వోఆర్ పట్టాదారు పాసు పుస్తకాల జాబితా, విలేజ్ మ్యాప్, గూగుల్ మ్యాప్, గ్రామ పంచాయతీ లే ఔట్ వంటి వివరాలు అధికారుల వద్ద ఉన్నప్పుడే అవీ ఏ భూములనేది గుర్తించగలుగుతారు. అంతే కాకుండా ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూముల వివరాలు కూడా అధికారుల వద్ద ఉండాలి. అప్పుడే భూముల వివరాలను సులువుగా గుర్తించే వీలవుతుంది. పరిశ్రమలు, ఇతర నిర్మాణాలు ఉన్నట్లయితే వాటిని భౌతికంగా గుర్తించే వీలుంటుంది. కానీ, భూ సేకరణ జరిగిన భూముల వివరాలు ఆయా శాఖల్లో ఉంటాయి. రోడ్లు, ఇతర అవసరాలకు తీసుకున్న అనేక భూములు ఇప్పటికీ రెవెన్యూ పహణీల్లో వస్తున్నాయి. ఇచ్చిన అతి తక్కువ సమయంలో వీటిని ఎలా గుర్తించేదని సర్వేలో పాల్గొంటున్న అధికారులు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో జరిగిన లే ఔట్ల వివరాలు కూడా గ్రామ పంచాయతీలో అందుబాటులో లేనట్లు తెలుస్తున్నది. నిజానికి పంచాయతీల పరిధిలోనే అనేక అక్రమ లే ఔట్లు జరుగుతున్నాయి. రికార్డుల ప్రకారంగా ఇవి నాలా కిందికి కన్వర్ట్ అయినట్లు కనిపించవు. మరీ ఇలాంటి భూముల పరిస్థితి సర్వే బృందాలు తేల్చుకోలేక పోతున్నాయి. అంతేకాకుండా, సర్వేను విచక్షణతో చేయాల్సి వస్తున్నది. ఒక సర్వే నంబర్‌లో ఎన్ని డివిజన్లు ఉంటే అన్నింటినీ సర్వే బృందాలు పరిశీలిస్తున్నాయి. ఒక సబ్ డివిజన్ సర్వే నంబర్‌లో రైతు తన అవసరం కోసం కొంత భూమిని అమ్ముకుని, మిగిలిన భూమిలో వ్యవసాయం చేసుకుంటుంటారు. అమ్మిన భూమి నాలా కింద కన్వర్ట్ అయితే మిగతా భూమి కూడా నాలా కిందనే చూపుతున్నట్టు తెలుస్తున్నది. ఇలాంటి వాటిని గుర్తించడంలో అధికారులు విచక్షణ ప్రదర్శించాలి. కానీ, తమదేమి పోయిందని ఉన్నది ఉన్నట్టు రాసుకుంటే రైతులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉన్నది. అంతే కాకుండా సెమీ అర్బన్ ఏరియాలో కూడా కొన్ని క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరమున్నది. మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో దశాబ్దాల క్రితం ఇండ్లు నిర్మించుకున్న రైతులు ఇంటికి ఆనుకొని ఉన్న భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇలాంటి భూముల్లో ఎక్కువగా కూరగాయలు పండిస్తుంటారు. ఒకే సర్వే నంబర్‌లో ఇల్లు ఉండి వ్యవసాయం చేస్తున్న భూములను ఏ విధంగా గుర్తించాలనేది సర్వే బృందాలకు బోధపడడం లేదు. ఇలాంటివన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలంటే సమయం పడుతుందనే అభిప్రాయం సర్వే బృందాల్లో వ్యక్తమవుతున్నది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఒత్తిడి మేరకు అధికారులు పైపై సర్వే చేసినట్టయితే నిజమైన రైతుకు అన్యాయం జరిగే పరిస్థితి కనిపిస్తున్నది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

> రైతు భరోసా కింద ఏడాదికి ఎకరాకు ₹15 వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇటీవల కేవలం ₹12 వేలు మాత్రమే ఇస్తామని మాట మార్చింది. ఇది కూడా సాగుకు యోగ్యత ఉన్న వాటికే ఇస్తామనడంతో పాటు వాటి లెక్కలు తేల్చేందుకు ఈ నెల 16 నుంచి వ్యవసాయ, రెవెన్యూ శాఖలతో సర్వే కూడా చేయిస్తున్నది. ఈ నెల 20 వరకు సర్వే ముగించి 21 నుంచి 24 వరకు గ్రామ సభల్లో ఆమోదం పొందాలని, 26 నుంచి రైతుల ఖాతాల్లో భరోసా సొమ్ము జమ చేయాలని చూస్తున్నది. అయితే, ఈ నాలుగు రోజుల్లో ఇంత పెద్ద సర్వే ఎలా పూర్తవుతుందనే విషయంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే సర్వేలో భూముల నిర్ధారణలో ఇబ్బందులు కనిపిస్తున్నాయి.

### ఆ ఒక్క నిబంధనతో అర్హుల్లో టెన్షన్

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంపైనా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి ఈ పథకం కింద ప్రతి నిరుపేద కుటుంబానికి ఏడాదికి ₹12 వేలు ఇవ్వాలి. కానీ, ప్రభుత్వం ఇక్కడ ఉపాధి హామీ పథకానికి మెలిక పెట్టింది. జాబ్ కార్డు ఉండి ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధి కూలీకి వెళ్లాలనే నిబంధన పెట్టారు. కరీంనగర్ జిల్లాలో 1,23,625 మంది జాబ్ కార్డులు పొందిన కుటుంబాలు ఉండగా, 2,31,802 మంది కూలీల పేర్లు నమోదై ఉన్నాయి. అందులో 82,460 కార్డులకు సంబంధించిన 1,26,338 మంది మాత్రమే ఆక్టివ్‌గా ఉన్నారు. ఏడాదిలో 20 రోజులు పని చేసింది కేవలం 43,650 మంది మాత్రమే. అందులో కొంత మందికి వ్యవసాయ భూమి కూడా ఉండి ఉంటుంది. ఆ నిబంధనకు కూడా అమలు చేస్తే ఎంత మంది కూలీలకు అర్హత ఉంటుందనేది సందేహమే. ఒక్క నిబంధనతో ఎంత మందికి అన్యాయం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఈ పథకంలో మరో చిక్కు కూడా కనిపిస్తున్నది. కొత్తగా మున్సిపాలిటీల్లో విలీనమయ్యే గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేస్తారు. దీంతో చాలా మందికి ఈ పథకం వర్తించకుండా పోతుంది. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీ కార్డుకు లింక్ పెట్టవద్దనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది.